
చారిత్రక సాక్ష్యానికి బీటలు

చారిత్రాత్మక కట్టడాలు, విలువైన సంపదకు సాక్ష్యంగా నిలుస్తున్న ఉదయగిరి దుర్గం బీటలు వారుతోంది. ప్రకృతి ప్రేమికులను అలరిస్తూ.. పురావస్తు అధికారుల ప్రయోగ నిలయంగా ఉన్న దుర్గం వైభవం రూపురేఖలు కోల్పోతోంది. ఇక్కడి కోటకు 500 ఏళ్ల చరిత్ర ఉంది. పల్లవులు, చోళులు, విజయ నగర రాజులు, మహ్మదీయ వంశీయులు, ఆంగ్లేయుల పాలనా కేంద్రంగా గతంలో విరాజిల్లింది. ఈ నేపథ్యంలో కోటపై నిర్మించిన కట్టడాల కింద బంగారు నాణేలు ఉంటాయని ప్రజలు విశ్వసిస్తుంటారు. ఈ క్రమంలో కొన్నేళ్లుగా పురాతన కట్టడాలను గుప్త నిధుల కోసం గుల్ల చేస్తున్నారు.

- గుప్త నిధుల కోసం ఆగని తవ్వకాలు
- గతంలోనూ విలువైన పురాతన సంపద దోపిడీ
- తవ్వకాల వెనుక అటవీ శాఖ?
- రెండ్రోజుల క్రితం తవ్వకాల ఆనవాళ్ల గుర్తింపు
- అయినా పెద్దగా పట్టించుకోని అటవీ శాఖ అధికారులు


ఉదయగిరి దుర్గం


ఇటీవల ఫారెస్టు సిబ్బంది అదుపులోకి తీసుకున్న వ్యక్తి(ఫైల్)

ఉదయగిరి : ఉదయగిరి దుర్గంపై అనేక చారిత్రాత్మక కట్టడాలున్నాయి. అలనాటి రాచరిక పాలన అంతరించిన తర్వాత మహ్మదీయుల పాలనలో అనేక ప్రాచీన కట్టడాలు ధ్వంసమయ్యాయి. సంప్రదాయక కట్టడాలు నేలమట్టం చేసి మసీదులు, బురుజులుగా మార్చారు. ఈ క్రమంలో అప్పుడే విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలను స్వాహా చేశారు. తర్వాత వచ్చిన ఆంగ్లేయులు సంపద కోసం అన్వేషణ చేసి దోచుకున్నారనే ప్రచారం ఉంది. స్వతంత్ర భారతంలో కూడా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయి. ప్రస్తుతం కూడా జరుగుతూనే ఉన్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత గుప్త నిధుల కోసం తవ్వకాలు మరింత ముమ్మరం చేశారు. సెన్సార్ పరికరాలను ఉపయోగించి ప్రాచీన కట్టడాల అడుగు భాగంలో ఉన్న విలువైన సంపదను గుర్తించి రాత్రివేళల్లో తవ్వకాలు సాగిస్తున్నారు.

ఇలా వెలుగులోకి..

ఉదయగిరి దిలార్ బావి వీధికి చెందిన కొంత మంది యువకులు శుక్రవారం రాత్రి దుర్గంపైకి లైటింగ్ సామగ్రితో చెరుకొని అక్కడే విందు ఏర్పాటు చేసుకుని, విద్యుత్ వెలుగులతో ఎంజాయ్ చేశారు. ఈ క్రమంలో వారు రామ బుగ్గ, కరీమ్ బుగ్గ ప్రాంతంలో ఆ రాత్రి గుప్త నిధుల కోసం కొందరు వ్యక్తులు తవ్వకాలు సాగిస్తున్నట్లు గుర్తించారు. కానీ అక్కడకు వెళ్తే ప్రమాదం ఉండొచ్చని భావించి వెళ్లలేదు. వీరిని గమనించిన గుప్త నిధుల తవ్వకం దార్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తెల్లవారుజాము తర్వాత యువకులు ఆ ప్రాంతానికి వెళ్లగా అక్కడ గుప్త నిధుల కోసం చేసిన తవ్వకాలు, అక్కడ వదిలేసిన పేలుడు సామగ్రి, విద్యుత్ వైర్లు, కొన్ని యంత్రాలను గమనించారు. ఈ విషయం తమ స్నేహితులకు ఫోన్ ద్వారా తెలుపగా, అన్నీ వదిలేసి గుట్టుచప్పుడు కాకుండా రావాలని సలహా ఇచ్చారు. ఈ క్రమంలో ఆ యువకుల్లో ఒకరు ఆ ఫొటోలను సోమవారం మీడియాకు చేరవేశారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది.


ఉదయగిరి దుర్గంపై రెండు రోజుల క్రితం వెలుగు చూసిన పేలుడు సామగ్రి

ఇటీవల మరోసారి..

గత శుక్రవారం దుర్గంపై రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులు కనిపించాయి. దీంతో ఉదయగిరి పట్టణవాసులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, సిబ్బంది సకాలంలో స్పందించలేదు. కనీసం ఆ తెల్లవారుజామున తర్వాత కూడా తెలుసుకునే ప్రయత్నం జరగలేదు. దీంతో మరోసారి స్థానికులు అటవీ శాఖకు చెందిన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం ఇద్దరు బేస్ క్యాంపు సిబ్బందితో పాటు కొత్తపల్లి బీట్ ఎఫ్‌బీఓ దుర్గంపైకి వెళ్లి అక్కడ ఏమీ జరగలేదని మీడియాకు చెప్పారు. అయితే సోమవారం దుర్గంపై తవ్వకాల ఆనవాలు, పేలుడు సామగ్రి ఫొటోలు వెలుగులోకి వచ్చాయి. కానీ అంతకు ముందు రోజు దుర్గంపైకి వెళ్లిన సిబ్బందికి ఇవేమీ కనిపించలేదు. దీనిని బట్టి వీరు కేవలం నామ మాత్ర తనిఖీలు చేశారనే విషయం అవగతమవుతోంది.

సిబ్బంది పాత్రపై అనుమానాలు

ఉదయగిరి దుర్గం అంతా పడమర బీట్ పరిధిలో ఉంటుంది. ఇక్కడ నిత్యం తవ్వకాలు జరుగుతుంటాయి. ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అటవీ శాఖ సిబ్బంది ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఏదైనా ఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడు హడావుడి చేయడం.. తర్వాత షరా మామూలే. ఇక్కడ పనిచేస్తున్న దిగువ స్థాయి సిబ్బందికి, తవ్వకాల ముఠాలకు సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ బీట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎఫ్‌బీఓ సక్రమంగా విధులకు రాకపోయినా, దిగువ స్థానంలో ఉన్న ఓ వ్యక్తి అన్నింటినీ మ్యానేజ్ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో దుర్గంపై పూర్తి పర్యవేక్షణ కొరవడింది. గత నెలలో దుర్గం సమీపంలో ఉన్న బండగానిపల్లి అటవీ ప్రాంతంలో గుప్తనిధుల తవ్వకాల ముఠాలో ఓ వ్యక్తిని సిబ్బంది పట్టుకున్నారు. విచారణలో ముఠాకు చెందిన పలువురు కీలకమైన వ్యక్తుల పేర్లు వెల్లడించారని, ఈ విషయం బయటకు చెబితే మరికొన్ని కేసుల్లో ఇరికిస్తామని హెచ్చరించడంతో అతను మిన్నకుండిపోయినట్లు ప్రచారంలో ఉంది. కీలక సమాచారం ఆధారంగా ముఠా సభ్యులను అరెస్టు చేసే అవకాశం ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదు అనేది ప్రశ్న. ఇప్పుడు దుర్గంపై జరుగుతున్న తవ్వకాల వెనుక అటవీ శాఖ సిబ్బంది పాత్ర ఉండొచ్చనే ప్రచారానికి ఇలాంటి ఘటనలు బలం చేకూరుస్తున్నాయి.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..

జలదంకి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బ్రాహ్మణ క్రాక సీనియర్ నేత వేలమూరి శ్రీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి జలదంకి మండలంలో పార్టీ పరిస్థితుల గురించి వివరించారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు


ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు ఆర్చి వద్ద బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరు–ముంబై రహదారిపై ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు ఆర్చి వద్ద ఇటీవల వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్న క్రమంలో ఆత్మకూరు పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. సీఐ జి.గంగాధర్, ఎస్సైలు జిలానీ, బి.సాయిప్రసాద్, శ్రీనివాసులురెడ్డి సిబ్బందితో కలిసి మంగళవారం ప్రమాద స్థలం వద్ద ఇరువైపులా వాహనాల వేగం తగ్గేలా ఈ బోర్డులను ఏర్పాటు చేశారు.

ఏఓ బాధ్యతల స్వీకరణ


ఎస్.కవిత

మర్రిపాడు: మర్రిపాడు మండల నూతన వ్యవసాయాధికారిణి(ఏఓ)గా ఎస్.కవిత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా సూళ్లూరుపేట మండలం నుంచి బదిలీపై మర్రిపాడుకు వచ్చారు. అదేవిధంగా మర్రిపాడులో బాధ్యతలు నిర్వహించిన ఎస్.రామ్మోహన్ జిల్లా వనరుల శాఖ టెక్నికల్ ఏఓగా బదిలీ అయ్యారు.

ఆర్థిక సాయం అందజేత



ఆత్మకూరు: ఇటీవల పొగాకు పనుల కోసం కూలీలను తరలిస్తున్న ఆటోను కారు వేగంగా ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సలీమా మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె కుటుంబానికి శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంచి పరమేశ్వరరెడ్డి మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. వెంకట్రావుపల్లి గ్రామంలోని సలీమా ఇంటికి ఆయన వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కుడుముల సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, కౌన్సిలర్ శివకోటారెడ్డి, ట్రస్ట్ సభ్యుడు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయాలి

ఉదయగిరి: మండలంలోని ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలని ఏపీఓ ఉమామహేష్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. ప్రజలకు నీటికుంటల నిర్మాణం, పండ్ల తోటల పెంపకాలపై క్షేత్ర సహాయకులు అవగాహన కల్పించి చైతన్యపరచాలన్నారు. ఉపాధి పనికి వచ్చిన వారికి మాత్రమే హాజరు వేయాలన్నారు. కూలీలకు కొలతల ప్రకారం పనులు కేటాయించాలన్నారు. సమావేశంలో ఈసీ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలను సహించం

సంగం: వ్యాపారులు తూకాల్లో తేడాలు వస్తే సహించేది లేదని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మెహిసిస్ హెచ్చరించారు. మండల కేంద్రమైన సంగంలో మంగళవారం ఆరు దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూకాల్లో తేడాలు ఉన్న ఐదు దుకాణదారులపై రూ.25 వేల జరిమానా విధించారు. అనంతరం మాట్లాడుతూ వ్యాపారులు తూకాల్లో తేడా రాకుండా కాటా సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. కాగా అధికారుల తనిఖీల నేపథ్యంలో పలువురు దుకాణదారులు షాపులకు తాళాలు వేసి పరారయ్యారు.

డిపో కార్మికుల తిరుగుబాటు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో గ్యారేజీలో కార్మికులు తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. డిపో మేనేజరు, ఏఎంఎఫ్‌ల విధానాలను నిరసిస్తూ గ్యారేజీలో మెకానిక్‌గా పని చేస్తున్న దశరథరామిరెడ్డి మంగళవారం ఆర్టీసీ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్యారేజీలోని సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే బుధవారం నుంచి మూడు రోజుల పాటు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తామని, అప్పటికీ న్యాయం జరగకపోతే ఉద్యమ కార్యాచరణ చేపడుతామని తెలిపారు.

అభయాంజనేయునికి పూజలు

ఆత్మకూరురూరల్: మండలంలోని దేపూరులో కొలువైన అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. కొమ్మి తిరుపతి నాయుడు కుటుంబ సభ్యులు భక్తులకు పప్పు, పొంగలిని అందజేశారు.

సన్మానం



మర్రిపాడు: మర్రిపాడు ఏఓగా పనిచేస్తూ జిల్లా వనరుల శాఖ టెక్నికల్ ఏఓగా బదిలీ అయిన ఎస్.రామ్మోహన్‌ను మండలంలోని వీఏఏలు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ నాలుగేళ్లు మర్రిపాడు మండలంలో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు.

'తల్లికి వందనం' అందించాలని వినతి



వరికుంటపాడు: అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు కూడా తల్లికి వందనం వర్తింపజేయాలని వారు ఉదయగిరిలోని ఐసీడీఎస్ సీడీపీఓ సునీతకు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.11,500 వేతనం వస్తున్న తమకు తల్లికి వందనాన్ని నిలిపివేయడం దారుణమన్నారు. దీనిపై 23న నెల్లూరు కలెక్టరేట్ దగ్గర ధర్నా చేపడుతామన్నారు.

ఎంపీడీఓగా భార్గవి

సీతారామపురం: మండల డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న భార్గవిరెడ్డి పూర్తి అదనపు బాధ్యతలతో ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న భాస్కర్ జూన్ 1 నుంచి సెలవులో ఉన్నారు. ఆయనకు జూలై 31 వరకు సెలవును పొడిగించడంతో భార్గవికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

పాలనకు అనర్హుడు చంద్రబాబు


జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి (జలదంకి): రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచి, రైతులు, విద్యార్థులు, మహిళలను ఇబ్బందుల పాలు చేస్తున్న చంద్రబాబు రాష్ట్ర పరిపాలనకు అనర్హుడని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని రామిరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబద్ధపు హామీలను ప్రజలు గమనించి నిరసనలు తెలుపుతున్నారని, ప్రజలకు అండగా ఉండి వారికి మద్దతుగా ప్రశ్నించేందుకే వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. సూపర్‌సిక్స్ అంటూ చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి సీఎం అయిన చంద్రబాబుకు ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయన్నారు. 2014లో బాబు వస్తేనే జాబు అంటూ ఊదరగొట్టి అధికారం దక్కించుకుని, ఉద్యోగాలు లేకుండా చేశాడన్నారు. అనంతరం వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 3.70 లక్షల ఉద్యోగాలు కల్పించి రాష్ట్ర చరిత్రలో ప్రగతికి నాంది పలికిందన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాలు తూతూ మంత్రంగా ఉన్నాయన్నారు. తల్లికి వందనంలో అర్హులకు నగదు జమ కాకపోవడంతో వారు సచివాలయాల చుట్టూ తిరుగుతూ టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పారదర్శకంగా పథకాలు అందినట్లు గుర్తుచేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి పట్టపగలే చుక్కలు చూపించే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. కావలి నియోజకవర్గంలో తన గురించి అందరికీ తెలుసని, తనపై విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. తాను నిరంతరం కావలి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, నాయకులు ఏగూరి చినపుల్లయ్య, గుద్లూరు మాల్యాద్రి, పేరం వెంకటేశ్వర్లు, పుల్లా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలకు గుణపాఠం తప్పదు


జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతిఒక్కరూ గమనిస్తున్నారని, దీనిపై ప్రజల నుంచి తగిన గుణపాఠం తప్పదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకావిష్కరణను పార్టీ నాయకులు చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపాలిటీ కమిటీ రాష్ట్ర కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఎస్సీసెల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 90 శాతం హామీలను అమలు చేశారన్నారు. జగనన్న ప్రభుత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళలకు ఆర్థిక భరోసా, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు చేరేలా పాలన సాగిందన్నారు. అప్పట్లో జగనన్న ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చారని, కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలకే దిక్కులేకుండా పోయిందన్నారు. అమ్మఒడి పథకంలో పాఠశాల నిర్వహణకు రూ.1000 తగ్గించి అందజేసినందుకు నానా రాద్ధాంతం చేసిన కూటమి నాయకులు, ప్రస్తుతం రూ.2 వేలు తగ్గించి కొందరికే తల్లికి వందనం అమలు చేస్తుండడాన్ని ఏ విధంగా సమర్థించుకుంటారని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు, 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు, మహిళలకు నెలకు రూ.1,500 తదితర పథకాలు ఏమయ్యాయని నిలదీశారు. కాగా సోమశిల జలాశయం నుంచి ఆత్మకూరు చెరువుకు సాగునీరు ఇస్తున్నామని చెబుతున్న ఇరిగేషన్ అధికారులు చెరువు మట్టిని కూటమి పార్టీ నాయకులు తరలిస్తున్న విషయంపై ఎందుకు చోద్యం చూస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిమి రమేష్‌రెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్ బి.రవికుమార్‌రెడ్డి, నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ముతీవర్, ముజ్జు, సయ్యద్ జమీర్, బొలిగర్ల వెంకటేశ్వర్లు, కల్పనారెడ్డి, హేమ, కొప్పోలు వెంకటేశ్వర్లు, ఎన్.ప్రతాప్, పి.అశోక్, సుబ్రహ్మణ్యంరెడ్డి, జమ్రు, కలాం పాల్గొన్నారు.

చీడపీడలపై అవగాహన అవసరం

అల్లూరు: సాగులో చీడపీడలపై రైతులకు అవగాహన అవసరమని ఏడీఏ నాగరాజు సూచించారు. అల్లూరు పరిసర ప్రాంతాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం స్థానిక పంట పొలాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు పొందాలంటే రైతులకు తప్పనిసరిగా విశిష్ట సంఖ్య అవసరమన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

- సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల, పడమటి కంభంపాడు గ్రామాల్లో మండల ఏఓ శైలజాకుమారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పచ్చిరొట్ట పైర్ల ప్రాముఖ్యత, వరిలో మొలకల శాతం నిర్ధారించుట, విత్తన శుద్ధి, నారుమడి యాజమాన్యం, నీరు, ఎరువులు, కలుపు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణాధికారి కృష్ణవేణి, వీఏఏలు కీర్తన, శివారెడ్డి పాల్గొన్నారు.
- ఆత్మకూరురూరల్: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల సాగుకు సిద్ధం కావాలని మండల ఏఓ కిశోర్‌బాబు అన్నారు. మండలంలోని చెర్లోయడవల్లి, బట్టేపాడు రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, మట్టి నమూనాల సేకరణ, కిసాన్ డ్రోన్ల వంటి పలు పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ పోలయ్య, వీఏఏ శ్రీహర్ష పాల్గొన్నారు.
- దగదర్తి: యూరియా అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని మండల ఏఓ పి.శ్రీధర్‌రెడ్డి కోరారు. దుండిగం, ధర్మవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. సర్పంచ్ బాలయ్య పాల్గొన్నారు.
- అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలం చిరమన, శ్రీకొలను గ్రామాల్లో ఏఓ సురేష్‌బాబు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ దేవసేనమ్మ వరి, మొక్కజొన్నలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఓ సురేష్‌బాబు ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి తెలిపారు. సిబ్బంది సుబ్బరాయుడు, లక్ష్మి, తిరుపతి పాల్గొన్నారు.
- సీతారామపురం: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల ఏఓ పి.చెన్నారెడ్డి అన్నారు. సింగారెడ్డిపల్లె గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొని, మాట్లాడారు. ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎరువుల యాజమాన్యం, సేంద్రియ ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు. ఏఈఓ సుధీర్‌కుమార్, వీఏఏ స్వప్న పాల్గొన్నారు.
- చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలంలోని రైతులు వ్యవసాయశాఖ ద్వారా అందించే పిల్లిపెసర, జనుము, జీలుగ పచ్చిరొట్ట విత్తనాలను తీసుకొని సాగు చేయాలని ఏఓ హిమబిందు సూచించారు. మండల కేంద్రమైన చేజర్ల, మడపల్లి రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సిబ్బంది సుజాత, డీవీ సుబ్బారావు, ఎస్.మమత, టి.మమత, వెటర్నరీ అసిస్టెంట్ మల్లికార్జున, గ్రామ నాయకుడు లక్ష్మీనరసారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన గంగాభవాని ఉత్సవాలు


ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

ఉదయగిరి రూరల్: మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న అనంతపురి గంగాభవాని తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారి గ్రామోత్సవం, మధ్యాహ్నం ప్రత్యేక పూజలు, సాయంత్రం పొంగళ్ల కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శుల నియామకం

సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శిగా వెంకటరత్నం, బసినేనిపల్లి పంచాయతీ కార్యదర్శిగా ఖాదర్ మొహిద్దీన్, అయ్యవారిపల్లి పంచాయతీ కార్యదర్శిగా మాల్యాద్రి నియమితులయ్యారు. కాగా బసినేనిపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న జిలాని వరికుంటపాడు మండలం ఇస్కపల్లి పంచాయతీకి, దేవమ్మచెరువు పంచాయతీ కార్యదర్శి జీవన్ ఉదయగిరి మండలం కొండాయపాళేనికి బదిలీ అయ్యారు.

పుస్తకాల పంపిణీ

ఉదయగిరి: ఉదయగిరి అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలోని వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు పీపీ–1, పీపీ–2 పుస్తకాలను మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో సీడీపీఓ సునీత అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తకాల్లోని కథలను చిన్నారులకు వివరించాలన్నారు. సూపర్‌వైజర్లు తేజస్విని, షాను పాల్గొన్నారు.

యోగాతో అనేక ప్రయోజనాలు


ఆత్మకూరు: ఎంవీఐ కార్యాలయంలో..


ఉదయగిరి రూరల్: వెంగళరావునగర్‌లో..

ఆత్మకూరు: యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని, దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు అన్నారు. స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం రోడ్డు సేఫ్టీ విధానాల గురించి వివరించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ మత్తు పానీయాలు సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు.

- ఉదయగిరి రూరల్: మండలంలోని వెంగళరావునగర్, గడ్డంవారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఉదయగిరి ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంలు యోగాంధ్ర కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. హెచ్‌ఎంలు హసీనా, మాలకొండయ్య, షరీఫ్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ పరిశీలన



సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని చిలకలమర్రి సచివాలయంలో జరుగుతున్న ఎస్టీ స్పెషల్ ఆధార్ డ్రైవ్‌ను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతసాగరంలో బుధవారం, సోమశిలలో గురువారం, ఉప్పలపాడు సచివాలయంలో శుక్రవారం ఆధార్ డ్రైవ్‌లు ఉంటాయని, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.